క్లుప్తంగా

'పునర్నిర్మాణం అంటే అప్పులు పెంచడమా?'

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పునర్నిర్మాణం అంటే అప్పులు పెంచుకుంటూ పోవడమేనా? అని కూటమి ప్రభుత్వాన్ని ఆమ్ ఆద్మీపార్టీ జోన్-సీ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు ప్రశ్నించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం అప్పులతో దివాలా అంచున ఉందని శ్వేత పత్రం విడుదల చేసిన ప్రభుత్వం, ఆరాచక ఆర్థిక విధానాలతో ముందు కెళ్లడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. రాష్ట్రం పునర్నిర్మాణానికి ఎటువంటి బడ్జెట్ కావాలి అన్న అంశంపై అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా పక్షాలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

ముత్యాలంపాడు విద్యుత్ సెక్షన్‌లో తనిఖీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సెక్షన్‌లో బుధవారం విద్యుత్ అధికారులు ఇంటెన్సివ్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ విభాగం నుంచి ఆరు బృందాలు, ఆపరేషన్ విభాగం నుంచి 50 బృందాలు కలిసి తనిఖీలు నిర్వహించాయి. అదనపు లోడు వినియోగిస్తున్న 104 సర్వీసులకు రూ.3.44 లక్షల జరిమానా విధించారు. తనిఖీల అధికారులుగా విజిలెన్స్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటేశ్వర్లు, విజయవాడ టౌన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు వ్యవహరించారు. తనిఖీల్లో ఆపరేషన్ విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, విజిలెన్స్ విభాగం నుంచి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీలకు ముందు అధికారులు సమావేశమయ్యారు.

విద్యార్థులు బాగా చదివి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు బాగా చదువుకుని తమ భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీలం రత్నకుమార్ సూచించారు. బావాజీపేటలోని నవజీవన్ బాలభవన్‌లో చిన్నారులకు కెరీర్ గైడెన్స్ బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. రత్న కుమార్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంతయ్య, అడ్మినిస్ట్రేటివ్ జోసెఫ్ తంబీ మాట్లాడుతూ.. పిల్లలు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి బాధ్యతగా చదువుకోవాలని సూచించారు. అనంతరం కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ ప్రసన్న మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు కూడా పిల్లల భవిష్యత్‌ను బాధ్యతతో తీర్చిదిద్దాలని కోరారు. ప్రోగ్రామ్ మేనేజర్ వసంత మాట్లాడుతూ.. పిల్లలకు మంచి ప్రవర్తన, మంచి అలవాట్లు, శారీరక, మానసిక దృఢత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సమస్యలకు వసతి గృహం

- సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో సమస్యల తిష్ట
- విద్యార్థులకు పుస్తకాల పంపిణీ జరగలేదు
- మరమ్మతులకు గురై పనిచేయని కంప్యూటర్లు
- శీతాకాలం వచ్చినా బెడ్‌షీట్లు అందని వైనం



బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్



టాయిలెట్స్ వద్ద కదలని మురుగు నీరు



పెచ్చులూడుతున్న భవనం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం సమస్యల నిలయంగా మారింది. ఇంటర్మీడియెట్, డిగ్రీతో పాటు సీపెట్ విద్యార్థులు ఇక్కడ వసతి పొందుతున్నారు. హాస్టల్‌లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. స్నానాలు చేసిన నీరు బయటకు వెళ్లక హాస్టల్ ప్రాంగణంలోనే తిష్టవేసి మురుగు మయంగా మారుతోందని పేర్కొన్నారు. రోజుల తరబడి వాడుక నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని, మరుగు దొడ్లలో పరిశుభ్రత తాండవిస్తోందని వివరించారు. తమ యోగ క్షేమాలను చూడాల్సిన వార్డెన్ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని హాస్టల్ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఎవరైన విద్యార్థులు అనారోగ్యానికి గురైనా రోగాలపాలైనా వైద్యం అందడంలేదని, నెలకు ఒక్క రోజైనా వైద్య సిబ్బంది హాస్టల్ వైపు రారని వాపోయారు. జ్వరం వచ్చిన విద్యార్థులు ఇళ్లకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి దాపురించిందని వివరించారు. హాస్టల్‌లో వసతులు లేక పలువురు విద్యార్థులు గదులు అద్దెకు తీసుకుని ఉంటున్నారని తెలిపారు.

గదుల్లో ఉక్కపోత

ప్రభుత్వ లెక్క ప్రకారం హాస్టల్‌లో 87 మంది విద్యార్థులకు వసతి కల్పించాలి. ప్రస్తుతం 67 మంది మాత్రమే ఉంటున్నారు. సగం కిటికీలు మూతవేసి ఉన్న గాలిరాని గదుల్లో ఉక్కపోతతో అల్లాడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పలు గదుల్లో శ్లాబుల నుంచి సిమెంటు పెచ్చులు ఊడి పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటీవల వచ్చిన బుడమేరు వరదలకు హాస్టల్‌లో ఉన్న తమ పుస్తకాలు తడిసిపోయాయని, ఇప్పటి వరకు కొత్త పుస్తకాలను ఇవ్వలేదని విద్యార్థులు పేర్కొన్నారు. ఎనిమిది గదుల్లో ఉండాల్సిన కంప్యూటర్లు పూర్తిగా తడిసి పాడైపోయాయని వెల్లడించారు. కంప్యూటర్లకు ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకపోవడంతో కంప్యూటర్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందిగా ఉందని వివరించారు.

అమలుకాని మెనూ

భోజనం, అల్పాహారం విషయంలో మెనూ అమలు కావడంలేదని విద్యార్థులు తెలిపారు. ఇడ్లీకి బదులు అన్నం వండి కిచిడీగా చేస్తున్నారని, పప్పు దినుసులతో తాళింపు లేని సాంబారు వడ్డిస్తున్నారని పేర్కొన్నారు. వరదలకు గ్రైండర్ తడిసి పాడవడంతో ఇడ్లీ, చెట్నీలకు నోచుకోవడం లేదని వివరించారు. బోర్డుకే మెనూ పరిమితమైందని, అందులో చెప్పిన ఆహార పదార్థాలు అందిన దాఖలాలు లేవని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హాస్టల్‌లో ఏమి జరుగుతుందో తెలుసుకునే నాథుడే లేరని వాపోయారు. విద్యాసంవత్సర ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇంత వరకు ప్రభుత్వం పుస్తకాలు పంపిణీ చేయలేదని, చలి కాలంలో వచ్చినా దుప్పట్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. ట్రంకు పెట్టెల్లో దాచుకున్న డబ్బులు, విలువైన వస్తువులు పోతున్నాయని వాపోయారు.

అడ్మిషన్‌కు రూ.300 చెల్లించాలి

ఎవరైన హాస్టల్‌లో చేరాలంటే వార్డెన్‌కు రూ.300 చెల్లించాల్సిందేనని విద్యార్థులు ఆరోపించారు. ఎస్ఆర్ఆర్ కాలేజీ విద్యార్థులను వార్డెన్ చేర్చుకోరని పేర్కొన్నారు. ఆ విద్యార్థులు సమయ పాలన లేకుండా ఉంటారన్న కారణాన్ని వార్డెన్ చూపుతున్నారని వివరించారు. ఇన్ని సమస్యలతో తాము సతమతమవుతున్నా ఉన్నతాధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల ఆరో తేదీన ఇన్‌చార్జి కలెక్టర్‌కు హాస్టల్ విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

విద్యార్థుల ఫిర్యాదుపై అధికారుల విచారణ



సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విచారణ చేస్తున్న అధికారులు

సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థులు వార్డెన్ సయ్యద్ కిర్మాణిపై చేసిన ఆరోపణలకు సంబంధించి సోషల్ వెల్ఫేర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కైలే శ్రీనివాస్, ఏఎస్‌డబ్ల్యూఓ గణేష్, పలువురు అధికారులు గురువారం విచారణ చేపట్టారు. హాస్టల్‌లో జరిగిన ఈ విచారణలో వార్డెన్ నిర్వాహకాలను అధికారుల దృష్టికి విద్యార్థులు తీసుకెళ్లారు. వార్డెన్ విద్యార్థులను బార్‌కు తీసుకెళ్తాడని, పనులు చేయిస్తుంటాడని, అడ్మిషన్ల సమయంలో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.300 తీసుకొంటున్నారని, కులం పేరుతో దూషిస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. మెనూ అమలుకావడంలేదని, ఆహారం నాసిరకంగా ఉంటోందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు తెలిపిన వివరాలను కలెక్టర్‌కు నివేదిక ద్వారా అందజేస్తామన్నారు. అవి వాస్తమని తేలితే వార్డెన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విచారణలో ఎస్ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషిస్తున్నారు



హాస్టల్‌లో కొత్తగా ప్రవేశించే విద్యార్థుల నుంచి హాస్టల్ వార్డెన్ మూడు వందల రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. వంట వారు మద్యం తాగి వంటలు చేస్తున్నారు. నాణ్యతలేని ఆహార పదార్థాలు పెడుతున్నారు. విద్యార్థులను వార్డెన్ కులం పేరుతో దూషిస్తున్నారు.

–విక్టర్ పాల్,డిగ్రీ విద్యార్థి

కూరలు బయట తెచ్చుకోవాలంట



కూరలు బాగుండలేదని వార్డెన్‌కు చెబితే బయట కర్రీ పాయింట్‌కు వెళ్లి సొంత డబ్బులతో తెచ్చుకోండి అంటున్నారు. విద్యార్థులకు ఏనాడూ వైద్యాధికారులు, సిబ్బంది వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహించలేదు. కాస్మొటిక్స్ చార్జీలు రావడంలేదు. హాస్టల్ భవనానికి మరమ్మతులు చేయడంలేదు.

– విజయ్, విద్యార్థి

మరమ్మతులు చేయిస్తాం

డ్రెయిన్‌ను బాగు చేయాలని, భవనానికి మరమ్మతులు చేయించాలని ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించాం. త్వరలో మరమ్మతులు చేయిస్తాం. వరదల కారణంగా కంప్యూటర్లు తడిసి పాడైపోయాయి. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన దుప్పట్లు ఇంకా రాలేదు. ట్రంక్ పెట్టెలను నేను విక్రయించుకోలేదు. విద్యార్థుల సర్టిఫికెట్లు, దుస్తులు ఎలా పోయాయో తెలియదు.

– సయ్యద్ కిర్మాణి, వార్డెన్

డ్రాయింగ్ పోటీలతో సృజనాత్మకతకు పదును



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టేందుకు డ్రాయింగ్ పోటీలు దోహదం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్‌శాఖ కమిషనర్ అనిల్ చంద్ర పునీత చెప్పారు. అనంత్ డైమండ్స్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 'స్పా' కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన డ్రాయింగ్ పోటీల అనిల్ చంద్ర పునీత ప్రారంభించారు.

17న బహుమతుల ప్రదానం

అనంత్ డైమండ్స్ వ్యవస్థాపకుడు జాస్తి అనంత పద్మశేఖర్ మాట్లాడుతూ.. చిన్నారులు తమ భావాలను చిత్రాల రూపంలో బహిర్గతం చేశారన్నారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ చైర్మన్ పి.రమేష్ మాట్లాడుతూ.. చిత్రలేఖనంపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడానికి ఏటా బాలల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు ఈ నెల 17వ తేది స్పా కళాశాలలో జరిగే బహుమతులను అందజేస్తామని చెప్పారు. స్పా కళాశాల రిజిస్ట్రార్ ఉమామహేశ్వర రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సంతోష్‌కుమార్, టి.మాధవరావు, చిత్రకారులు టి.మృత్యుంజయరావు, చిన్న స్ఫూర్తి, ఎన్.శ్రీధర్, వై.కళాసాగర్, బీఎస్‌వీ.రమేష్, పర్యావరణ మానవ సమాజ భద్రత బాధ్యత ఫౌండేషన్ చైర్మన్ సింగలూరి శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాల్లోని స్కూళ్లు, కాలేజీల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై చిత్రాలను గీశారు.

సుందరయ్యనగర్‌లో 'ప్రజాపోరు'

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 63వ డివిజన్‌లోని సుందరయ్య నగర్‌లో బుధవారం ప్రజాపోరు యాత్ర జరిగింది. కూటమి ప్రభుత్వం అధిక ధరలను అరికట్టాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దని, పెట్రోలు, డీజిల్ ధరలను నియంత్రించాలని, చౌక డిపోల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు ఇవ్వాలని, వరద బాధితులకు సహాయం అందించాలని కోరుతూ గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఈ యాత్ర జరిగింది. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.దుర్గారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతోందని విమర్శించారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక అమలు చేయడం సరైనది కాదని అన్నారు. 63వ డివిజన్ సీపీఎం శాఖ కార్యదర్శి బొంగు రాంబాబు, సభ్యులు పి.సాంబిరెడ్డి, బి.అమ్ములు, నిర్మల, మునాఫ్ పటేల్, జగన్ పాల్గొన్నారు.

29న వీఎంసీ కౌన్సిల్ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఈ నెల 29వ తేదీన జరగనుంది. సమావేశాన్ని నిర్వహించేందుకు అధికారులు ముమ్మరంగా కరసత్తు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే నగరంలోని కార్పొరేటర్లకు డివిజన్ సమస్యలపై ప్రతిపాదనలు పంపాలని వీఎంసీ కార్యదర్శి సూచించారు. ఈ మేరకు కౌన్సిల్ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

'జీవన్ ప్రమాణ్'ను సద్వినియోగం చేసుకోవాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విశ్రాంత ఉద్యోగులు, ఫ్యామిలీ పెన్షనర్ల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'జీవన్ ప్రమాణ్' డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్‌లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం రైల్వే సమీపంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ఏడీఆర్‌ఎంలు, బ్యాంక్ అధికారులతో కలసి జీవన్ ప్రమాణ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్ నిర్వహణలో సులభతర సేవలు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జీవన్ ప్రమాణ్ ఫేస్ అథెంటికేషన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్‌లను సమర్పించే సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీంతో పెన్షనర్‌లకు తమ లైఫ్ సర్టిఫికెట్‌లను సమర్పించేందుకు పెన్షన్ పంపిణీ కేంద్రాల చుట్టూ తిరిగే ఇబ్బందులు ఉండవన్నారు. సంబంధిత పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవడం, ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించడం వంటి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. డిజిటల్ సర్టిఫికేట్ సేవలను పొందేందుకు పెన్షనర్‌లకు మార్గనిర్దేశం చేయాలని సిబ్బందికి సూచించారు. ఏడీఆర్‌ఎంలు శ్రీనివాసరావు కొండా, పీఈ ఎడ్విన్ పాల్గొన్నారు.

హాకర్లపై దౌర్జన్యాలకు పాల్పడితే సహించం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో హాకర్లతో రాష్ట్ర ప్రభుత్వం, నగరపాలక సంస్థ అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిరువ్యాపారులకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. కక్షసాధింపుతో పలుచోట్ల దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బెజవాడకు ఉపాధి కోసం నిత్యం వేల మంది వస్తుంటారని, చిరు వ్యాపారాలతో జీవనం సాగిస్తారని వివరించారు. ఈ ప్రభుత్వంలో హాకర్లు రోడ్ల పక్కన వ్యాపారం చేసుకునే పరిస్థితి కనిపించడం లేదని మల్లాది విష్ణు ఆవేదన వ్యక్తంచేశారు. లెనిన్ సెంటర్, బీఆర్టీఎస్ రోడ్డు, బుడమేరు వంతెన, కండ్రిక, ప్రకాష్‌నగర్‌లో దుకాణాలను చూస్తేనే ఈ విషయం అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలు, పొట్టచేత పట్టుకుని వచ్చిన వారికి శరాఘాతంగా మారాయని వాపోయారు. సీ ప్లేన్‌లో విజయవాడ నుంచి శ్రీశైలం వెళ్తే, గన్నవరం నుంచి విమానంలో విశాఖ పట్నం వెళ్తే సంబరాలు జరుపుకొనే ఈ ప్రభుత్వానికి పేదల ఆకలి కేకలు మాత్రం ఎందుకు పట్టవని ప్రశ్నించారు. ఆన్‌లైన్ విధానంలో ఆధార్ అనుసంధానంతో హాకర్ల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని, కొత్త సమస్యలను సృష్టించకూడదని సూచించారు. తాము అధికారంలో ఉండగా చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాలను జగనన్న తోడు పథకం ద్వారా ఆదుకున్నామని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా చిరువ్యాపారుల పొట్టకొడుతోందని ఆరోపించారు. హాకర్లపై దౌర్జన్యాలకు పాల్పడితే సహించబోమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలు, వీఎంసీ అధికారుల దౌర్జన్యంపై కౌన్సిల్ సమావేశంలో కచ్చితంగా నిలదీస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు.. ఆటోకు నిప్పు పెట్టిన డ్రైవర్



మంటల్లో కాలుతున్న నాగులు ఆటో

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక ఓ ఆటో డ్రైవర్ తన వాహనానికి నిప్పు పెట్టాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన షేక్ నాగులు 12 ఏళ్లుగా ఆటో నడుపుతున్నాడు. ఏడాదిన్నర క్రితం ఓ ప్రైవేటు ఫైనాన్స్ వద్ద ఆటో తీసుకొని నడుపుతున్నాడు. ఆటో తోలగా వచ్చిన డబ్బుతోనే అద్దె ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నాడు. సెప్టెంబర్‌లో బుడమేరు వరదతో న్యూ ఆర్ఆర్‌పేటలోని తన ఇంటితో పాటు ఆటో కూడా పూర్తిగా మునిగిపోయింది. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూసినా ప్రయోజనం లేక అప్పు చేసి రూ.35 వేలతో ఆటోను బాగుచేయించుకున్నాడు. మూడు నెలల నుంచి ఆటో కిస్తీ కట్టడం లేదని ఫైనాన్స్ కంపెనీ వారు గత నెలలో ఆటోను తీసుకెళ్లిపోయారు. దీంతో నాగులు మళ్లీ అప్పు చేసి కిస్తీ కట్టి ఆటోను విడిపించుకున్నాడు. ఇంతలో టైర్లు పాడైపోవడంతో వాటి కోసం కూడా డబ్బు ఖర్చుపెట్టాడు. బుధవారం సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్ద ఆటో నడుపుకొంటున్న నాగులును ఫైనాన్స్ కంపెనీ వారు అడ్డుకుని ఈఎంఐలు కట్టాలని వేధించడం మొదలు పెట్టారు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆయన తన ఆటోపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. సమీపంలోని ఆటో డ్రైవర్లు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆటో డ్రైవర్ నాగులును, సదరు ఫైనాన్స్ కంపెనీ వారిని పిలిపించి మాట్లాడుతున్నారు.

నిలిచి ఉన్న బస్సును ఢీకొట్టిన మరో బస్సు

కేతేపల్లి: ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో హైవేపై నిలిచిపోయిన ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కేతేపల్లి వద్ద విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ లగ్జరీ బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. కేతేపల్లి వద్దకు చేరుకోగానే ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడి రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో సిబ్బంది బస్సులోని ప్రయాణికులను మరో బస్సులోకి ఎక్కించి గమ్యస్థానాలకు పంపించారు. అదే మార్గంలో వస్తున్న ఉయ్యూరు డిపోకు చెందిన మరో ఆర్టీసీ లగ్జరీ బస్సు కేతేపల్లి వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ఉయ్యూరు బస్సు డ్రైవర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు రెండు కాళ్లు విరిగిపోయాయి. బస్సులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన పి.సూర్యసాయి, తిరుపతమ్మ, ఎం.రజనీలకు స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.